## క్లుప్తంగా

### పోటా పోటీగా వేలం పాటలు



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

శిరివెళ్ల: కోటపాడు శ్రీ వీరభద్ర, చెన్న కేశవ స్వామి మాన్యం కౌలుకు బహిరంగ వేలం సోమవారం పోటా పోటీగా జరిగాయి. ఆలయాలకు భారీగా ఆదాయం సమకూరింది. 88 ఎకరాలకు వేలం నిర్వహించగా రూ.22.04 లక్షలు లభించింది. కాగా గతేడాది రూ.14.66 లక్షలు వచ్చింది. ఈ ఏడాది ఆలయాలకు అదనంగా రూ.7.38 లక్షల ఆదాయం సమకూరింది. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈఓ వేణనాథరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకుడు వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి, సర్పంచు డి.గుర్రప్ప, రైతులు పాల్గొన్నారు.

### ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలు

శిరివెళ్ల: మండలంలోని గుంప్రమాన్‌దిన్నె గ్రామ శివాలయంలో సోమవారం నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవం ఘనంగా జరిగింది. వెంకటాపురం పురోహితుడు వసంతకుమార్ శర్మ ఆధ్వర్యంలో శివపార్వతులకు అభిషేకాలు చేపట్టారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఉత్సవాలకు హాజరై పూజల్లో పాల్గొన్నారు. మాజీ సర్పంచు నరసింహారెడ్డి, గ్రామ పెద్దలు ఉశేనిరెడ్డి, రాజారెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు చీమల అనూష పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో గంగమ్మవ్వ ఆరాధన

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కల్పనా సెంటర్‌లో వెలసిన కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో కాశినాయన ప్రథమ శిష్యురాలైన ఆకుల గంగమ్మవ్వ 8వ ఆరాధన వేడుకలను నిర్వాహకులు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునే గంగమ్మవ్వ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పూలంగి సేవ జరిపించారు. సామూహిక కుంమార్చన అనంతరం మహా మంగళ హారతులు ఇచ్చి, భక్తులకు యథావిధిగా అన్నదానం చేశారు. డాక్టర్ గోపాల్‌రెడ్డి, చక్రపాణి, ఈశ్వరరెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### ఎన్‌టీఆర్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్‌గా నంద్యాల న్యాయవాది

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల గన్నవరంలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జులను నియమించింది. ఇందులో ఎన్‌టీఆర్ జిల్లా ఇన్‌చార్జ్‌గా నంద్యాల సీనియర్ న్యాయవాది ఖాదరబాద్ నర్సింగరావును నియమించారు. ప్రస్తుతం ఆయన నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ ఆదేశాలు జారీ చేసింది.

### ప్రజలు సంతృప్తి చెందేలా పనిచేద్దాం



స్పందనకు హాజరైన అధికారులు

ఉయ్యాలవాడ: స్పందన కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కారమయ్యేలా ప్రతి అధికారి అంకితభావంతో పనిచేస్తే ప్రజలు సంతృప్తి చెందుతారని తహసీల్దార్ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులతో మాట్లాడారు. స్పందన అర్జీలను మొక్కుబడిగా పరిష్కరించకుండా క్షేత్రస్థాయికి వెళ్లి పూర్తి స్థాయిలో ఏ శాఖకు సంబంధించిన ఆ మండల స్థాయి అధికారి విచారించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఏఓ రాజేంద్రకుమార్, ఏపీఓ రవి ప్రకాష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మిశైలజ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రథమ చికిత్సపై శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

నంద్యాల టౌన్ : నంద్యాల జిల్లాలో హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల్లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలకు స్థానిక జిల్లా సర్వజన ఆసుపత్రిలో ప్రథమ చికిత్సపై డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఆర్. వెంకటరమణ ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స చేయడం వల్ల ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చన్నారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స పట్ల అవగాహన పెంచుకోవాలని చెప్పారు. పాము కాటు, గాయాలకు కట్టుకట్టడం, కుట్లు వేయటం, తదితర చికిత్సలపై శిక్షణ ఇస్తామన్నారు. నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ రేఖ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నేర్చుకుందాం.. మెళకువలు పొందుదాం

- నంద్యాల జిల్లాలో 50 వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు
- శిక్షణలో పాల్గొంటున్న 1,200 మంది విద్యార్థులు
- విద్యార్థుల సందడితో శిబిరాలు కళకళ
- రోజూ ఉదయం, సాయంత్రం మూడు గంటల పాటు శిక్షణ



హు..హా..ఆత్మకూరు కేవీకే ఇండోర్ స్టేడియంలో తైక్వాండో నేర్చుకుంటున్న విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించాలని ప్రభుత్వం ప్రత్యేక క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసింది. ఇందులో కొత్తగా నేర్చుకునే వారి నుంచి ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడిన వారిని మెళకువలను తర్ఫీదు పొందిన కోచ్‌లు, సీనియర్ ప్లేయర్లు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకు నంద్యాల జిల్లాలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసింది. శిబిరాలు ఈనెల 1న ప్రారంభమై జూన్ 10వ తేదీ వరకు కొనసాగుతాయి. విద్యార్థులు నిత్యం క్రీడల సాధనలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నంద్యాల జిల్లాలో 50 కేంద్రాల్లో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. మొత్తం 23 క్రీడల్లో సుశిక్షితులైన కోచ్‌లు, సీనియర్ ఆటగాళ్లు, వ్యాయామ ఉపాధ్యాయులు తర్ఫీదు ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 50 మంది కోచ్‌లతో 1200 మంది బాలబాలికలు సాధన చేస్తున్నారు. జిల్లాలో ఆర్చరీ, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, సెపక్‌తక్రా, సాఫ్ట్‌బాల్, తైక్వాండో, వాలీబాల్, యోగా తదితర క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు.



గురి చూసి కొట్టు..అహోబిలంలో ఆర్చరీ శిక్షణలో చిన్నారులు

నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లోని స్పోర్ట్స్ అథారిటీ కాంప్లెక్స్‌లోనున్న శిబిరంలో దాదాపు 200 మందికి పైగా విద్యార్థులు ఫెన్సింగ్, హాకీ, తైక్వాండో, కరాటే, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. చీఫ్ కోచ్ రాజు, కోచ్‌లు లక్ష్మీనారాయణ(ఫెన్సింగ్), కిశోర్(వాలీబాల్), వరప్రసాద్ (అథ్లెటిక్స్) జైనుల్లావుద్దీన్(తైక్వాండో), రామరాజ్(బాస్కెట్‌బాల్)లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. మూడేళ్ల చిన్నారుల నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు శిక్షణలో పాల్గొంటున్నారు. అంతేగాక ఇక్కడ దాదాపుగా ఏడెనిమిదేళ్ల నుంచి ఫెన్సింగ్ క్రీడలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించడం విశేషం. ప్రతిరోజూ ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7గంటల వరకు శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి.

శిక్షణ ఇస్తున్న ప్రాంతాలు..

| ప్రాంతం | శిక్షణ కేంద్రాలు |
|---|---|
| నంద్యాల | 8 |
| ఆళ్లగడ్డ | 14 |
| డోన్ | 2 |
| చాగలమర్రి | 2 |
| బనగానపల్లె | 2 |
| ఆత్మకూరు | 3 |
| మహానంది | 3 |
| సంజామల | 2 |
| దొర్నిపాడు | 2 |
| పాములపాడు | 1 |
| కొలిమిగుండ్ల | 1 |
| గడివేముల | 3 |
| శ్రీశైలం | 3 |
| కోవెలకుంట్ల | 3 |
| బేతంచెర్ల | 1 |

### జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటా



మాది నంద్యాల పట్టణం. 8వ తరగతి పూర్తయింది. జిల్లా, రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ అండర్–14 జట్టులో ఆడాను. మరిన్ని మెళకువల కోసం నంద్యాల స్పోర్ట్స్ స్టేడియంలో కోచ్ లక్ష్మీనారాయణ వద్ద శిక్షణ పొందుతున్నా. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా.

– మిద్దె సిసిర గ్రేస్, క్రీడాకారిణి

### విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు



వేసవి క్రీడా శిబిరానికి మూడేళ్ల వయస్సు నుంచి 18సంవత్సరాల విద్యార్థులు వచ్చి ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కబడ్డీ, తైక్వాండో, బాస్కెట్‌బాల్, ఫెన్సింగ్ తదితర క్రీడల్లో శిక్షణ ఇస్తున్నాం. రోజూ ఉదయం, సాయంత్రం 3గంటల పాటు శిక్షణ ఇస్తున్నాం. వీరితో పాటు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి క్రీడాకారులు కూడా శిక్షణలో పాల్గొంటున్నారు.

– కిశోర్, కోచ్

### సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ ఏడాది వేసవి సెలవుల్లో 45రోజుల పాటు వివిధ క్రీడల్లో తర్ఫీదు పొందిన కోచ్‌లు, సీనియర్ ప్లేయర్లతో శిక్షణ ఇస్తున్నాం. గతంలో ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించారు.

– నరసింహరాజు, స్టేడియం సీఈఓ, నంద్యాల



ఇదిగో కిక్.. ఆత్మకూరులో బాక్సింగ్‌లో మెళకువలు నేర్పుతున్న కోచ్



జెడ్పీహెచ్ఎస్ పేరుసోమలలో సెపక్‌తక్రాలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు



కత్తి యుద్ధం.. నంద్యాల స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫెన్సింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

### నేడు మినీ జాబ్ మేళా

ఆళ్లగడ్డ/రుద్రవరం: శిరివెళ్ల మండలం యర్రగుంట్లలోని జీటీఆర్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23వ తేదీన మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డి సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మేళాకు హెటిరో డ్రగ్స్, సుజల పైప్స్, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. 10వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చేసిన యువతీ యువకులకు అర్హతను బట్టి ఉద్యోగావకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 9701303790, 9440224291 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో క్రైస్తవులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహ, క్రిస్టియన్ సెంట్రల్ కమిటీ నాయకులు మన్నెం జానయ్య, ప్రభుదాసు కోరారు. సోమవారం ఈ మేరకు స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలని, అలాగే క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. పీటర్, జోసెఫ్, స్వర్ణన్‌రాజ్, బిన్నిహీన్, ఏసురాజు పాల్గొన్నారు.

### 26న మండల మీట్

దొర్నిపాడు: ఈనెల 26వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగఅనసూయ సోమవారం తెలిపారు. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

### పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

ఆళ్లగడ్డ: పొలాలను సారవంతం చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తోందని బాచేపల్లి ఎంపీటీసీ నాగేశ్వరరావు అన్నారు. గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం వ్యవసాయాధికారుల సమక్షంలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## విద్యార్థులకు గ్లాసులు మంజూరు



హెచ్‌ఎంలకు గ్లాసులకు పంపిణీ చేస్తున్న డిప్యూటీ ఈఓ

నంద్యాల(న్యూటౌన్): జగనన్న గోరుముద్ద పథకానికి జిల్లాలోని 1,365 పాఠశాలలకు 1,52,526 స్టీల్ గ్లాసులు మంజూరయ్యాయని డిప్యూటీ ఈఓ మహబూబ్‌బేగ్ తెలిపారు. సోమవారం స్థానిక విశ్వనగర్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు గ్లాసులు పంపిణీ చేశారు. నంద్యాల మండలానికి 16,631 గ్లాసులు మంజూరు కావడంతో పంపిణీ చేశామని ఆయన చెప్పారు. గ్లాసులపై జగనన్న గోరుముద్ద అనే పేరు కూడా ముద్రించారన్నారు. నంద్యాలలోని 28 మండలాల ఎంఈఓలకు గ్లాసులను అందించామని, వీటిని హెచ్‌ఎంలకు అందజేస్తారని తెలిపారు. ఎండీఎం ఇక్బాల్, ఎంఈఓ బ్రహ్మంనాయక్, ప్రధానోపాధ్యాయులు ప్రమీల, మోహన్‌రెడ్డి, అజీజ్ పాల్గొన్నారు.

### ఇంటి వద్దే వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

గోస్పాడు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్నట్లు దీబగుంట్ల వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జునరెడ్డి చెప్పారు. మండలంలోని కానాలపల్లె గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి నడవలేని స్థితిలో ఉండి మంచానికి పరిమితమై పలు వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వైద్య సేవలు అందించారు. వ్యాధుల నుంచి కోలుకోవడానికి వైద్య నిపుణుల సలహాలు, సూచనలు పాటిస్తూ.. క్రమం తప్పకుండా ఆహార పదార్థాలు, మందులు వాడాలని సూచించారు. పక్షవాతం, గుండె సంబంధ వ్యాధులు, రక్తపోటు, మధుమేహం, వంటి దీర్ఘకాలిక వ్యాధులు రావడానికి ప్రధానంగా ఆహారంలో వచ్చే మార్పులను గుర్తించి అందుకు అనుగుణంగా నడుచుకోవాలని చెప్పారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### బీమా తక్షణ సాయం అందజేత



నంద్యాలలో నగదు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 26వ వార్డుకు చెందిన గుద్దేటి శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కౌన్సిలర్ మేస చంద్రశేఖర్, సచివాలయ వెల్ఫేర్ మనోహర్, వలంటీర్ దేవేంద్రనాయక్ సోమవారం మృతుడి భార్య మాధవికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు అందజేశారు. నాయకులు మద్దిలేటి, గద్దల వెంకటేశ్వర్లు, బొమ్మా దాసు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలకేంద్రానికి చెందిన బోయ మద్దిలేటి రంగడు ఇటీవల మరణించాడు. ఆయన వైఎస్సార్ బీమాకు అర్హుడు కావడంతో తక్షణ సాయంగా మృతుడి కుమారుడు మహేష్‌కు రూ.10 వేలను ఎంపీడీఓ సోమవారం అందజేశారు. మిగిలిన రూ.90వేలు అన్ని ధ్రువ పత్రాలు సమర్పించిన వెంటనే నామినీ అయిన లక్ష్మిదేవి బ్యాంక్ ఖాతాకు జమ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మిదేవి పాల్గొన్నారు.

### నేడు వాహనాల వేలం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ఎస్పీ కార్యాలయ ఆవరణలో మంగళవారం వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడి సరైన పత్రాలు, యజమానుల ఆచూకీ తెలియని వాహనాలను వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.3వేలు డిపాజిట్‌ను టూటౌన్ స్టేషన్‌లో చెల్లించి రసీదు పొందాలని, రసీదు ఉన్న వారినే వేలం పాటకు అనుమతిస్తామని చెప్పారు.

### దీక్షను విజయవంతం చేయాలి

గోస్పాడు: రాయలసీమ ప్రజల హృదయ స్పందన అయిన సిద్దేశ్వర అలుగు నిర్మాణాన్ని చేపట్టాలని ఈనెల 31వ తేదీన నిర్వహిస్తున్న జల జాగారణ దీక్షను విజయవంతం చేయాలని సాగునీటి సాధన సమితి నాయకులు కోరారు. మండలంలోని గోస్పాడు, శ్రీనివాసపురం, యాళ్లూరు, ఒంటివెలగల తదితర గ్రామాల్లో సోమవారం పర్యటించారు. వైఎన్.రెడ్డి, రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అలుగు నిర్మాణానికి రాజకీయాలకు అతీతంగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం దీక్ష పోస్టర్లను విడుదల చేశారు. సమితి నాయకులు పాల్గొన్నారు.

### 'విద్యా కానుక' పరిశీలన

ఉయ్యాలవాడ: మండలానికి సరఫరా అయిన విద్యా కానుకలను ఎంఈఓ అనురాధ సోమవారం పరిశీలించారు. జగనన్న విద్యా కానుక కింద మండలానికి మొదటి విడతగా 7,514 పాఠ్యపుస్తకాలు మంజూరయ్యాయి. 1– 10వ తరగతి వరకు 2,517 మంది విద్యార్థులకు 25,485 పాఠ్యపుస్తకాలు అవసరమన్నారు. 6వ తరగతి విద్యార్థులకు 168 డిక్షనరీలు, 1–10వ తరగతి వరకు బాలురకు, 1– 5వ తరగతి వరకు బాలికలకు సంబంధించి 1,420 బెల్ట్‌లు వచ్చాయని చెప్పారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి అన్ని రకాల పాఠ్యపుస్తకాల కిట్లు ఆయా పాఠశాలలకు చేరవేస్తామని ఎంఈఓ స్పష్టం చేశారు.

### దరఖాస్తు చేసుకోండి

గోస్పాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఖాజాహుసేన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆసక్తి గల విద్యార్థులు cre.ap.gov.in లేదా apmr.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. బీసీ, ఓసీలు రూ.150, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.75 ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించాలన్నారు. ఇప్పటి వరకు 80 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.

## ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధులు మీరే



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు గ్రామ వలంటీర్లేనని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గ్రామ వలంటీర్లను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు దేశంలో విప్లవాత్మకమైన వ్యవస్థలుగా పేరుగాంచాయని చెప్పారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో వలంటీర్లది కీలక పాత్రన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు తెల్లవారక ముందే వారి ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ చేసి వారి మనస్సులు దోచారన్నారు. టీడీపీ పాలనలో గ్రామ పంచాయతీల వద్ద పింఛన్లు కోసం పడిగాపులు కాసేవారన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని వలంటీర్లను కోరారు. టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టి ప్రజలకు వాస్తవాలను వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం, సర్పంచులు శివారెడ్డి, సాలమ్మ,జింకల నాగన్న,మేర్వ చిన్ననరసింహారెడ్డి, పెద్ది రమణయ్య, సుభహాన్, గుర్రప్ప, రఘునాథరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రమేష్, నాయకులు ఇందూరి ప్రతాపరెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఈఓఆర్డీ సాల్మన్‌రాజు,పంచాయతీ కార్యదర్శులుపాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీలో చేరిక..**

స్థానిక 7వ వార్డుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు షేక్ కరీంబాషా, జమాల్‌బాషా, కార్యకర్తలు షేక్షావలి, మదార్‌షా,ఇస్మాయిల్, మాబాషా, అతావుల్లా, మహమ్మద్ అజాం, రఫీ, సికిందర్, సాదక్, అబ్దుల్, కాదర్ బాషా, అన్వర్, హమీద్, జుబేర్, గిడ్డ మాబాషాకు చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే గంగుల

## అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం



శిరివెళ్లలో వృద్ధురాలికి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

శిరివెళ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమ ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయం–3 పరిధిలోని నూరాన్‌పేట, ఎంపీడీఓ కార్యాలయ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాల గురించి వివరించి బుక్‌లెట్ అందజేశారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధికి సంక్షేమ పథకాలు ఎంతో ముఖ్యమో అదే స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతూ సీఎం జగనన్న ఆదర్శ పాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. మండలంలో ఇప్పటి వరకు రూ. 50 లక్షలతో పనులు పూర్తయ్యాయన్నారు. సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, ఎంపీపీ నాయక్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, దేవస్థానం చైర్మన్ దాదిరెడ్డి తిమ్మరాయుడు, వీరారెడ్డిపల్లె సర్పంచు శివారెడ్డి, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, నాయకులు అన్వర్, డీ.రఫీ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

## మహానందిలో భక్తుల సందడి



కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: మహానంది ఆలయం సోమవారం భక్తులతో కళకళలాడింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

## ఇంటింటా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ప్రభుత్వ పథకాల లబ్ధిని చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందజేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని, పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 15వ వార్డులో కౌన్సిలర్ అనూషతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ని విపత్తులు వచ్చినా, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా, ఆర్థిక ఇబ్బందుల్ని అధిగమించి నాలుగుళ్లుగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల్ని కొనసాగిస్తున్నారని కొనియాడారు. పట్టణంలో 3,006 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని, ఈ పట్టాలు ఎప్పుడో పంపిణీ చేయాల్సిందని, టీడీపీ నాయకులు అడ్డుపడటంతో ఆగిపోయాయన్నారు. కోర్టు పేదల పక్షాన తీర్పు ఇవ్వడంతో నంద్యాలలో పండుగ వాతావరణంలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తున్నామన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు సాయిరాంరెడ్డి, నాయకులు జమాల్, శీను, భాస్కర్, శంకర్, షాకీర్, లక్ష్మీదేవి, ఫాతిమా, గిరి, సోమశేఖర్‌రెడ్డి, రహంతుల్లా, అమృతరాజ్ పాల్గొన్నారు.

## నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



పట్టాభిరామస్వామి ఆలయం

రుద్రవరం: మండలంలోని ఆర్.కొత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన పట్టాభిరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు మంగళవారం నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తామని నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఎద్దుల బండలాగుడు పోటీలు, రాతిగుండు ఎత్తే పందెం తదితర పోటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.